'పది'లో ముగ్గురే..

- పాఠశాలలో ఒకప్పుడు 500 మంది.. ప్రస్తుతం 65 మంది విద్యార్థులు
- నూత్‌పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల పరిస్థితి



నూత్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల

డొంకేశ్వర్ (ఆర్మూర్): ఉమ్మడి నందిపేట్ మండలంలో ఒకప్పుడు నూత్‌పల్లి పాఠశాల ఒక వెలుగు వెలిగింది. ఒకప్పుడు 500 మంది విద్యార్థులున్న సంఖ్య ప్రస్తుతం ఆరు నుంచి పదో తరగతి వరకు కేవలం 65 మంది మాత్రమే ఉన్నారు. అప్పట్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉందని ప్రభుత్వం హాస్టల్‌ను కూడా ఏర్పాటు చేసింది. రానురాను విద్యార్థుల సంఖ్య తగ్గుతూ రావడంతో హాస్టల్‌ను మూసివేశారు. ఇప్పుడు స్కూల్‌కు కూడా అదే పరిస్థితి ఏర్పడింది. విద్యా శాఖ అధికారులు పట్టించుకోక పోవ డంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. కొన్నేళ్లుగా అడ్మిషన్ల సంఖ్య ఏ మా త్రం పెరగడం లేదు. గతేడాది నుంచి ఇంగ్లింష్ మీడియం అమలు చేస్తున్నా నూత్‌పల్లి కాదని డొంకేశ్వర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుకునేందుకు విద్యార్థులు ఉత్సాహం చూపుతున్నారు. పదో తరగతిలో ముగ్గురు విద్యార్థులుంటే ప్రస్తుతం ఇద్దరు విద్యార్థినులు మాత్రమే పాఠశాలకు హాజరవుతున్నారు. మిగతా తరగతుల్లోనూ పెద్దగా విద్యార్థులు లేరు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు సర్పంచ్‌తో పాటు స్థానికులు ఆరాట పడుతున్నా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చర్యలేవీ చేపట్టడం లేదు.

విద్యార్థుల సంఖ్య ఇలా

తరగతి	విద్యార్థులు
6	12 మంది
7	17
8	19
9	14
10	3
మొత్తం	65

సమస్యల తిష్ట..

విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని రాష్ట్ర ప్ర భుత్వం మన ఊరు- మన బడి కింద నిధులు మంజూరు చేయలేదు. దీంతో పాఠశాలలో మరమ్మతులు చేసుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. విద్యార్థులకు త్రాగు నీటి కోసం ఆర్వో ప్లాంటు లేదు. బాలికలకు టాయిలెట్లు సక్రమంగా లేవు. స్కావెంజర్లు లేకపోవడంతో పరిశుభ్రత లోపించింది. ఎలక్ట్రిసిటీ రిపేర్లు కూడా అవసరమున్నాయి. విద్యాశాఖ ఉన్నతాధికారులు నూత్‌పల్లి పాఠశాలలోని లోపాలను సరిదిద్ది విద్యార్థుల సంఖ్యను పెంచాల్సి అవసరం, మరమ్మతులకు నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


పదో తరగతిలో ఉన్న ఇద్దరు విద్యార్థినులకు పాఠాలు చెప్తున్న టీచర్

క్లుప్తంగా

అందుబాటులో ఉండాలి



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన జగదీష్ చందర్ బుధవారం నిజామాబాద్‌లో ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్ కుమార్‌ను మార్యదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని ఇన్‌చార్జి సీపీ సూచించారు.

నర్సరీ తనిఖీ



బోధన్ రూరల్: మండల కేంద్రమైన సాలురాలో బుధవారం డిప్యూటీ సీఈవో రాజన్ నర్సరీ, మంజీర నది నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. అయన వెంట ఎంపీడీవో పర్వన్న, ఎంపీఓ మధుకర్ ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



వేల్పూర్: మణిపూర్ రాష్ట్రంలో మహిళలను కించపరచి హత్య చేసిన నింధితులను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోతె భూమన్న డిమాండ్ చేశారు. బుధవారం ఆయన వేల్పూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, మణిపూర్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే అక్కడ అల్లర్లు తీవ్రస్థాయికి చేరాయని ఆరోపించారు.

హాస్టళ్లలో కనీస వసతులు కల్పించాలి


నవీపేట: హాస్టల్‌లలో పేరుపోయిన సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బోడా అనిల్ కోరారు. హాస్టల్ సమస్యలను పరిష్కరించాలని నిర్దేశిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నాలుగు రోజుల కిందట చేపట్టిన జీపు యాత్ర బుధవారం నవీపేటకు చేరుకుంది. హాస్టల్‌లను పరిశీలించిన అనంతరం ఆయన నవీపేటలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్‌లలో కనీస వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమయిందన్నారు. హాస్టల్‌లపై విరక్తి చెందిన విద్యార్థులు ఇంటికి వెళ్లే దుస్థితి ఏర్పడిందన్నారు. కేజీటుపీజీ ఉచిత విద్య అన్న సీఎం ఆచరణలో చూపడం లేదన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు విఘ్నేష్, నాగరాజు, దీపిక తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు



బోధన్‌టౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని విజయసాయి పాఠశాలలో హరిత హారం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మెన్ అబ్బగోని గంగాధర్ గౌడ్, పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్, క్లబ్ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావ్, ప్రతినిధులు చక్రవర్తి, శ్రీనివాస రాజు, నాయిని కృష్ణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



వర్ని(మోస్రా) : మోస్రా మండలంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లలో నెలకొన్న డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు మోస్రా తహసీల్దార్ సాయిలు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భూపాల్ రెడ్డి, సుదర్శన్ గౌడ్, లింగం, శ్రీనివాస్, స్వామి గౌడ్ పాల్గొన్నారు.

అవగాహన లేకుండా మాట్లాడితే సహించం

నిజామాబాద్‌నాగారం: తన రాజకీయ లబ్ధి కోసం పేద రెడ్లకు నష్టం జరిగేలా మాట్లాడిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని తెలంగాణ రెడ్డి సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి కరుణాకర్ రెడ్డి ప్రకటనలో డిమాండ్ చేశారు. రెడ్లు కేవలం 5 శాతం ఉన్నారని అవగాహన లేకుండా జీవన్‌రెడ్డి మాట్లాడటం సరికాదని ఆయన పేర్కొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

డిచ్‌పల్లి: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్లు కూలిపోయాయి. బుధవారం నడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గాంధీనగర్ కాలనీలో ప్రభాకర్‌కు చెందిన నివాస ఇల్లు పాక్షికంగా కూలింది.

విజయమే లక్ష్యంగా పని చేస్తాం


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

వర్ని: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బాన్సువాడలో కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా అందరం కలిసి కట్టుగా పని చేస్తామని రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఎలమంచిలి శ్రీనివాసరావు వెల్లడించారు. బుధవారం వర్నిలో కాంగ్రెస్ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బలంగా ఉన్న కాంగ్రెస్ ఓటు బ్యాంకును కాపాడుకుంటామని వెల్లడించారు. బీఆర్‌ఎస్ రైతు వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్తామన్నారు. టిక్కెట్ ఎవరికిచ్చినా అభ్యర్థి విజయానికి కలిసికట్టుగా కృషి చేస్తామన్నారు. వర్షాలకు నష్టపోయిన రైతులు, పేదలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సమావేశంలో పీసీసీ డెలిగేట్ కునిపూర్ రాజిరెడ్డి, గిరిజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రతాప్ సింగ్, జాతీయ రైతు సంఘాల సమాఖ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సోమశంకర్, నాయకులు గంగా ప్రసాద్, రాంబాబు, బోయిడి లక్ష్మణ్, కిషన్ పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి


వేల్పూర్‌లో తెగిపోయిన కాడి చెరువును పరిశీలిస్తున్న బీజేపీ నేత ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి

వేల్పూర్: వర్షాలకు పంట కోల్పోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. వేల్పూర్‌లో గండిపడ్డ కాడి చెరువును బుధవారం ఆయన పరిశీలించారు. వేల్పూర్, పడగల్ నవాబు చెరువు, పచ్చలనడ్కుడ ఊర చెరువు, జానకంపేట్ చెరువు తెగిపోవడంతో వందలాది ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటలు నీట మునిగాయన్నారు. ఆయన వెంట నాయకులు మల్కన్నగారి మోహన్, ఏలేటి రమేశ్,ఎం.మహిపాల్, బద్దం రాజారెడ్డి, యాల్ల రమేశ్, రమేశ్, నర్సారెడ్డి, రవి, రాజేశ్వర్ ఉన్నారు.

కుల సంఘ భవనాలకు నిధులు మంజూరు


పద్మశాలీ సంఘ సభ్యులకు నిధుల మంజూరు ఉత్తర్వుల ప్రతిని అందజేస్తున్న మంత్రి వేముల

కమ్మర్‌పలి/వేల్పూర్: మండలంలోని పలు గ్రామాల్లో వివిధ కుల సంఘ భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం 1.22 కోట్లు మంజూరు చేసింది. ఇందులో భాగంగానే నాగాపూర్, బషీరాబాద్‌లోని పద్మశాలీ కుల సంఘాల భవన నిర్మాణాలకు సంబంధించి నిధు లు మంజూరు పత్రాన్ని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు రాజుల కృష్ణమురళి, గరుడు శ్రీకంఠం, కోశాధికారి పోతు ధరణి, నాగాపూర్ అధ్యక్షుడు అంబల్ల అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని తెరిపించాలి


మాట్లాడుతున్న బీఎస్పీ నాయకుడు గైని గంగన్న

బోధన్: నిజాం షుగర్ ఫ్యాక్టరీని వెంటనే తెరిపించి సీఎం కేసీఆర్ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి గైని గంగాధర్, నియోజకవర్గ ఇన్‌చార్జి సింగాడి పాండు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఫ్యాక్టరీని ప్రభుత్వ పరం చేసుకుని అనంతరం వాటిని తెరిపిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఫ్యాక్టరీ మూసేయడంతో వందలాది మంది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని పేర్కొన్నారు నాయకులు రామకృష్ణ, నాగభూషణం, యూసుఫ్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి


కందకుర్తి వద్ద గోదావరి నదిని పరిశీలిస్తున్న బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్

రెంజల్/బోధన్ టౌన్: గోదావరి నది పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్ సూసించారు. బుధవారం కందకుర్తి వద్ద గోదావరి నది ఉధృతిని పరిశీలించారు. వర్షాలకు వాగులు, నదులు పొంగి పోర్లుతున్నందున ఎలాంటి నష్ట వాటిల్లకుండా ప్రజల్లో చైతన్యం తీసుకరావాలని సిబ్బందికి సూచించారు. నదిలో చేపల వేటకు వెళ్లొద్దన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను ఖాళీ చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 100 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఆయన వెంట రూరల్ సీఐ శ్రీనివాస్‌రాజ్, రెంజల్ ఎస్సై ఉదయ్ కుమార్ ఉన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేయాలి



డొంకేశ్వర్: డొంకేశ్వర్ మండలం అన్నారం గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగిందని, దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని అన్నారం ఎంపీటీసీ అట్టోలి సంజీవ్ డిమాండ్ చేశా రు. గ్రామంలో ఉపాధిహామీ క్రింద మరుగుదొడ్లు నిర్మించారని, వచ్చిన డబ్బులు రూ.6.50లక్షలు లబ్ధిదారులకు ఇవ్వకుండా జీపీ ఖాతాలో ఉంచి వాటిని పక్కదారి పట్టించారని ఆరోపించారు. ఈ విషయంపై ఎండీవోకు, పంచాయతీ కార్యదర్శికి, సర్పంచ్‌కు ఎన్ని సార్లు అడిగినా సరైన సమాచారం ఇవ్వడం లేదని అన్నారు. జీపీ ఖాతా నుంచి అక్రమంగా డబ్బులు డ్రా చేసి సొంతానికి వాడుకున్నారని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో కూడా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానన్నారు. ఆ డబ్బులను రికవరి చేసి లబ్ధిదారులకు పంచాలని ఆయన కోరారు.

మొహర్రం పండుగ

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లిలో మొహర్రం పండుగ సందర్భంగా మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మదర్, దేగాంబాబు, ఖాదర్, సాహెబ్‌హుస్సేన్, రాజమహ్మద్, సాజీద్, సతీష్ పాల్గొన్నారు.

కాల్వల కబ్జాతో జాతీయ రహదారి జలమయం


మాణిక్‌భండార్ వద్ద జాతీయ రహదారి దుస్థితి

మాక్లూర్: కాల్వలను కబ్జా చేసి భవనాలు నిర్మించడం వల్ల మండలంలోని మాణిక్‌భండార్ వద్ద 63వ నంబర్ జాతీయ రహదారి జలమయమవుతోంది. వర్షాకాలంలో ప్రతి ఏటా ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సమస్యను మూడేళ్లుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్య ఫలితంగా గత ఏడాది ఇక్కడి నీటి ప్రవాహంలో మునిగి ఒకరు మృతి చెందారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కాకతీయ మహిళ ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లేదారి నీట మునిగింది. వర్షం వచ్చినప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీసులు కాపలాగా ఉంటున్నారు.

జాతీయ రహదారుల సంస్థ తప్పిదమే..

63వ నంబర్ జాతీయ రహదారి విస్తరణ పనులు జరిగినప్పుడు అక్కడున్న డిస్ట్రిబ్యూటరీ కాల్వ కుచించుకుపోయినా పట్టించుకోలేదు. వర్షాకాలంలో వరద ఎక్కువైనప్పుడు కాల్వ చిన్నది కావడంతో వర్షం నీరంతా జాతీయ రహదారి జలమయమై రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. దీనికి జాతీయ రహదారుల సంస్థ తప్పిదమేనని ఇరిగేషన్ శాఖ ఏఈ దివ్య తెలిపారు.

పసుపు పంట పరిశీలన


పంటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవన అధికారి

బాల్కొండ: మెండోరా మండల పరిధిలో పలు గ్రామాల్లో అధిక వర్షాల వలన నష్టపోయిన పసుపు పంటను జిల్లా ఉద్యానవన అధికారి నర్సింగ్ దాస్ బుధవారం పరిశీలించారు. పసుపు పంటలో వర్షాల వలన కలిగే నష్టాలను గురించి, తెగుళ్లను గురించి రైతులకు వివరించారు. అధిక వర్షపాతం వలన పసుపు పంటకు వేరుకుళ్ల అధికంగా సోకుతుందన్నారు. తగునివారణ చర్యలు తెలిపారు. పసుపు పంట నష్టం అంచనను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. ఆయన వెంట పసుపు పరిశోధన కేంద్రం అధికారి మహేందర్, ఉద్యానవన శాఖ అధికారులు రోహిత్, సుమన్ పాల్గొన్నారు.

అమరులైన జవాన్లకు నివాళి



ఆర్మూర్ బార్ ఆధ్వర్యంలో అమర జవాన్లకు నివాళులర్పిస్తున్న న్యాయవాదులు


ఆర్మూర్ లిల్లీపుట్ స్కూల్‌లో..

ఆర్మూర్‌టౌన్/ పెర్కిట్: ఆర్మూర్ కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం న్యాయవాదులు కొవ్వొత్తులు వెలిగించి కార్గిల్ అమర వీర జవాన్లకు నివాళులర్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిన్నారెడ్డి, ఉపాధ్యక్షుడు జగన్, న్యాయవాదులు ఖాందేష్ శ్రీనివాస్, జెస్సుఅనిల్ పాల్గొన్నారు. అదేవిధంగా లిల్లీపుట్ పాఠశాలలో కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా విద్యార్థులు జవాన్ల వేషధారణతో అలరించారు. కార్గిల్ యుద్ధ విశేషాలు జవాన్ల అసమాన ప్రతిభను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల దీక్షకు బీఆర్‌ఎస్ నాయకుల మద్దతు


రైతుల దీక్షలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

రెంజల్(బోధన్): రెంజల్ బందల్ల రోడ్డు పనులను ప్రారంభించాలని స్థానిక గాంధీ విగ్రహం వద్ద రైతులు చేపట్టిన రిలే దీక్షలు 29వ రోజుకు చేరాయి. బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం రైతులకు మద్దతు తెలిపారు. సమస్యను విడతల వారీగా పరిష్కరించేందుకు కృషి చేద్దామని రెంజల్ సర్పంచ్ మర్ల రమేశ్‌కుమార్ సూచించారు. రైతు లు కటికెల శ్రీనివాస్, కొండల్‌వాడీ శ్రీనివాస్, అహ్మద్ వెంకటి, ఒడ్డెన్న, దెశ్‌పేట్ పోశెట్టి, పిల్లి రాజన్న, ఇటుకల ఖాజ, బీఆర్‌ఎస్ నాయకులు రఫీక్, ఈసాని అనీల్, నారాయణ, సమీ పాల్గొన్నారు.

బస్ డిపోను పూర్తి స్థాయిలో ప్రారంభించాలి


మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు మల్లికార్జున్ రెడ్డి

భీమ్‌గల్: భీమ్‌గల్ బస్ డిపో ప్రారంభించే విషయమై బీఆర్‌ఎస్ నాయకులు డ్రామాలు ఆడకుండా పూర్తిస్థాయిలో పునః ప్రారంభించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్ డిమాండ్ చేశారు. భీమ్‌గల్‌లో బుదవారం బీజేపీ నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ 1994 లో ప్రారంభించిన బస్‌డిపోను నష్టాల పేరుతో మూసివేశారన్నారు. డిపోను పునః ప్రారంభిస్తామని గత అసెంబ్లీ ఎన్నికల్లో వేముల ప్రశాంత్‌రెడ్డి హామీ ఇచ్చినా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. స్పందించకపోతే పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామన్నారు. మండల అధ్యక్షుడు మహిపాల్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ కనికరం మదు, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్ పాల్గొన్నారు.

సమ్మెలో కార్మికులు.. పేరుకుపోయిన చెత్త


వర్ని మార్కెట్లో ఉన్న చెత్త


బోధన్‌లో భిక్షాటన చేస్తున్న కార్మికులు

వర్ని/రుద్రూర్/పెర్కిట్/కమ్మర్‌పల్లి/బోధన్‌టౌన్: ఉద్యోగ భద్రత కల్పించాలనే తదితర డిమాండ్లతో పంచాయతీ కార్మికులు 21 రోజులుగా నిరవధిక సమ్మెలోకి వెళ్లడంతో గ్రామాల్లో చెత్త ఎక్కడ పడితే అక్కడ పేరుకుపోయింది. దీంతో దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్య తీవ్రంగా ఉన్న పంచాయతీల్లో అధికారులు దగ్గరుండి కూలీలతో పారిశుధ్య పనులు చేయిస్తున్నా కార్మికులు అడ్డుకుంటున్నారు. వర్షాలు పడుతున్నందున చెత్త పేరుకుపోవడం కారణంగా వ్యాధులు సోకే అవకాశం ఉందని భయందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్మికులు భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. రిలే దీక్షల్లో పాల్గొన్న కార్మికులకు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతలు మద్దతు తెలిపారు.

సంక్షిప్తం

ఎస్సైకి సన్మానం



బోధన్ రూరల్ (బోధన్): బోధన్ రూరల్ ఠాణా ఎస్సై ఎన్.నాగనాథ్‌ను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంజీవ్, ప్రజా ప్రతినిధులు బుధవారం సన్మానించారు. శాంతి భద్రతలను కాపాడాలని వారు కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సంజీవ్ పటేల్, వెంకటేశం గుప్తా, హన్మంతు, శివకుమార్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

వర్ని(చందూర్): వీఆర్‌ఏలను క్రమబద్ధీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేస్తూ చందూర్‌లో వీఆర్‌ఏలు బుధవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

పనులు ఎందుకు నిలిపివేశారు?

రుద్రూర్: మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు చేపట్టకుండా ఎందుకు నిలిపివేశారనే విషయమై తెలుసుకునేందుకు బుధవారం ఎంపీడీవో బాల గంగాధర్ ఆలయాన్ని సందర్శించారు. భక్తులకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శి గంగాధర్‌ను ఆదేశించారు. విండో మాజీ చైర్మెన్ పత్తి రాము, ఆలయ కమిటీ చైర్మన్ వి.రామరాజు, ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ ఉన్నారు.

నిధుల మంజూరు

నందిపేట్ (ఆర్మూర్): నందిపేట్ మండలంలోని పలు ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణ పనుల కోసం నిధులు మంజూరయ్యాయి. తల్వేద లిఫ్టనకు రూ. 1.55 కోట్లు, లక్షల వన్నెల కే లిఫ్టనకు రూ.2.09 కోట్లు, కొండూరు లిఫ్ట్‌కు రూ. 18 లక్షల మంజూరు చేశారు.

బీజేపీ నాయకుల ఆందోళన

బోధన్: హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నియోజకవర్గం పరిధిలోని బోధన్, ఎడపల్లి, నవిపేట, రెంజల్ మండలాల బీజేపీ నాయకులు బుధవారం ఆందోళన చేశారు. ఆయా మండలాలకు కొత్తగా అధ్యక్షులను నియమించడంతో వివాదం నెలకొంది.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

రుద్రూర్ : పోతంగల్ మండలం సుంకిని గ్రామానికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు బుదవారం బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జి పోచారం సురేందర్ రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ స్పీకర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులైన పలువురు పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాధవ రావు, పార్టీ నాయకులు శ్రీనివాస్ రావు తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లిలో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయానికి చింత ప్రదీప్‌కుమార్ రూ. 55,555 విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బద్రి, శేఖర్, హరీష్‌రెడ్డి, గణేష్, రవీంధర్, మురళి, జగన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

రుద్రూర్: కోటగిరి నుంచి ఎత్తోండకు బైక్‌పై వెళ్తున్న పంచాయతీ కార్మికులు అదుపుతప్పి పడిపోవడంతో ముగ్గురు గాయపడ్డారు. ఎత్తోండలో ప్రైవేటు వ్యక్తులతో పనులు చేయిస్తున్నారని సమాచారం తెలుసుకుని వెళ్తుండగా ప్రమాదం జరిగింది.

ప్రధాని ప్రసంగాన్ని వీక్షించండి

నవీపేట: నవీపేట మండల కేంద్రంలో బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డి మోహన్‌రెడ్డి ఫర్టిలైజర్ దుకాణాలకు వెళ్లి రైతులతో సమీక్ష నిర్వహించారు. గురువారం నరేంద్రమోడీ వర్చువల్‌గా రైతులను ఉద్దేశించి ప్రసంగించనున్నారని తెలిపారు. మండల నాయకులు మొవ్వ నాగేశ్వరరావు, ఆనంద్, సత్యం రెడ్డి, రాజేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

చెక్కుల పంపిణీ



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను బీఆర్ ఎస్ నాయకుడు పండిత్ పవన్ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అబ్దుల్ రహెమన్, పడాల్ గణేష్, శ్రీకాంత్, నవీన్ పాల్గొన్నారు.

మాక్లూర్: మండలంలోని చిక్లి గ్రామంలో పలువురి లబ్ధిదారులకు సీఎంఆర్ ఎఫ్ చెక్కులను బీఆర్‌ఎస్ నాయకుడు దీమెర శ్రీకాంత్ లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎర్రన్న, షబ్బీర్, కారం నవీన్, సాగర్, ముత్తేన్నలు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	హిడింబ - 11.00, 4.40, 10.20
	హత్య (తెలుగు) - 1.55, 7.35
స్క్రీన్-2 –	బేబి (తెలుగు) - 11.45, 3.15, 6.45, 10.15
స్క్రీన్-3 –	ఓపెన్‌హ్యామర్ (ఇంగ్లీష్) - 10.00, 2.00, 6.00, 10.00
స్క్రీన్-4 –	బేబి(తెలుగు)-12.00
	సామజవరగమన - 3.40
	అన్నపూర్ణ ఫొటోస్టూడియో(తెలుగు)-6.40
	మిషన్ ఇంపాజిబుల్ - 9.30